విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇస్తున్న ఎమ్మెల్యే మాధవరం

బాలానగర్: ఫిరోజ్‌గూడలోని ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ఆల్విన్‌కాలనీ: రైతుభరోసా నగదును సకాలంలో అందజేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ రామకృష్ణ వెల్ఫేర్ ఆధ్వర్యంలో పురందర్ రెడ్డి గురువారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్. రామచంద్రరావు, సంజీవరెడ్డి, తాండవ కృష్ణ, జి. ప్రసాద్, మూర్తి, లింగయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ సుందరీకరణ పనుల పరిశీలన



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: చిత్తారమ్మ ఆలయ సుందరీకరణ పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురాతన ఆలయాలను పునః నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పీజేఆర్‌నగర్ కాలనీలో నివసించే జయరాజ్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ బాధిత కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి డీవిజి ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు.

28న జగన్నాథ రథయాత్ర

మియాపూర్ : అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) మియాపూర్ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 28న జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తున్నామని మియాపూర్ ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షులు శ్రీ రామ్‌దాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న మధ్యాహ్నం 2 గంటలకు చందానగర్‌లోని ఆర్ఎస్ బ్రదర్స్ నుండి ఈ రథయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. రథయాత్ర మదీనాగూడ, ఆల్విన్ క్రాస్ రోడ్డు, మియాపూర్ క్రాస్ రోడ్డు, జేపీఎన్‌నగర్ మీదుగా విశ్వనాథ్ గార్డెన్ వద్ద ముగుస్తుందని తెలిపారు. అదేరోజు సాయంత్రం 6 గంటల నుండి 10 గంటల వరకు విశ్వనాథ్ గార్డెన్‌లో సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభూజీల ప్రసంగాలు ఉంటాయని అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.ఈ రథయాత్ర, సమావేశంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

1.3 కిలోలు స్వాధీనం, కేసు నమోదు

చందానగర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన ప్రకారం వివరాలు...పాపిరెడ్డి కాలనీకి చెందిన హరినాథ్ (24), శివాజీ (25)లు మహారాష్ట్రలోని వర్ధి నుంచి గంజాయి తీసుకువచ్చి పాపిరెడ్డి కాలనీలో అధిక రేట్లకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో గురువారం సాయంత్రం 4.00 గంటలకు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి సుమారు 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

అసలే ఇరుకు.. ఆపై ఆక్రమణలు..!



రోడ్లపైనే పెద్ద సంఖ్యలో నిలిపిన ద్విచక్ర వాహనాలు

- కూకట్‌పల్లి పాతగ్రామంలో అంతా ఇష్టారాజ్యం
- రోడ్లను ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాలు
- రహదారులకిరువైపులా వాహనాల పార్కింగ్
- రాకపోకలకు స్థానికుల తీవ్ర ఇబ్బందులు
- పట్టని అధికారులు

కూకట్‌పల్లి: అసలే ఇరుకు రోడ్లు..ఆపై రోడ్డు ఆక్రమణలు..మరోవైపు తక్కువ స్థలంలోనే బహుళ అంతస్తుల నిర్మాణాలు..ఇంకోవైపు రోడ్లపైనే వాహనాలు పార్కింగ్..వెరసి కూకట్‌పల్లి పాత గ్రామంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ ప్రతి వీధి 10 నుంచి 15, 20 అడుగులకు మించి లేకపోవడంతో స్థానికులు తమ ఇళ్లను ఖాళీ చేసి వేరేచోట్ల ఇళ్లను కొనుగోలు చేసి వెళ్లిపోయారు. అయితే కొందరు తమ పాత ఇళ్ల స్థానంలో రోడ్లను ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాలను నిర్మించి హాస్టల్స్‌కు అద్దెకు ఇస్తున్నారు. జాతీయ రహదారికి పక్కనే ఉండడం, సమీపంలో బస్టాప్, మెట్రో స్టేషన్ ఉండడంతో అద్దెలు కూడా విపరీతంగా పెరిగాయి. హాస్టల్ నిర్వాహకులు సైతం ఒక్కో ఇంట్లో 100 నుంచి 150 మంది వరకు చేర్పించుకుంటున్నారు. పార్కింగ్ కేంద్రంగా ఉండాల్సిన సెల్లార్లను వంట గది, డైనింగ్ హాల్‌గా మార్చి హాస్టల్స్ ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు అందులోని యువతి, యువకులు తమ వాహనాలను రోడ్లకిరువైపులా పార్కింగ్ చేస్తుండడంతో ఎదురెదురుగా కార్లు వస్తే వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. ఇటీవల కూకట్‌పల్లి జడ్పీ పాఠశాల సమీపంలో వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో ఆసుపత్రికి వెళ్లాల్సిన అంబులెన్స్ దాదాపు 20 నిమిషాల పాటు అందులోనే చిక్కుకుపోయిందని స్థానికులు చెబుతున్నారు. హాస్టల్స్ ఏర్పాటు చేసేముందు వారికి కనీస వసతులు ఉన్నాయా..? లేవా..? అని సంబంధిత అధికారులు ఎలాంటి అనుమతులు ఇవ్వకుండానే హాస్టల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. హాస్టల్స్‌లో అగ్ని ప్రమాదాలు జరిగినా కనీసం ఫైర్ ఇంజిన్ కూడా లోపలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. హాస్టల్స్ ఏర్పాటు చేయాలంటే రెండు వైపులా మెట్లు ఉండాల్సి ఉంటుంది. ఇవేగాకుండా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టీ షాపులు, కూరగాయల దుకాణాలు మొదలగు చిన్న చిన్న షాపులు ఏర్పడ్డాయి. వీరు కూడా రోడ్డు ఆక్రమణ చేసి ముందుకు రావడం.. అటు షాపింగ్‌కు వచ్చిన వారు రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండడంతో స్థానికులు కొంతమంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులు ఇక్కడ హాస్టల్స్‌ను పరిశీలించిన తర్వాతే హాస్టల్స్‌కు అనుమతి ఇవ్వాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి



కూకట్‌పల్లి పాత గ్రామం గతంలో ఎంతో ప్రశాంతంగా ఉండేది. అయితే జనాభాకు అనుగుణంగా ఇక్కడి కొందరు నివాసితులు అద్దెల కోసం రోడ్లను సైతం ఆక్రమించి తక్కువ స్థలంలోనే బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో రోడ్లన్నీ కుచించుకుపోయాయి. కూకట్‌పల్లి ప్రధాన చౌరస్తా నుంచి తమ ఇళ్లల్లోకి వెళ్లాలంటే ప్రధాన రహదారిపై షాపుల వారు కూడా రోడ్లను ఆక్రమించడం, నివాస ప్రాంతాల్లో హాస్టల్స్‌ను ఏర్పాటు చేయడంతో వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. దీంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ విషయమై జీహెచ్ఎంసీ అధికారులకు ఆన్‌లైన్‌లో, లిఖిత పూర్వకంగానూ ఫిర్యాదు చేశాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– మొలుగు ప్రకాశ్‌రావు, కూకట్‌పల్లి

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చాలా డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి రూ. 45 కోట్లు కేటాయించాలని కోరినట్లు తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



సినీ నటి, ఎమ్మెల్సీ విజయశాంతితో నాగరాజు

కూకట్‌పల్లి: ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, హిందూస్థాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు ఆధ్వర్యంలో సినీ నటి, ఎమ్మెల్సీ విజయశాంతిని హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఏవైనా సమస్యలుంటే తనను సంప్రదించాలని ప్రభుత్వం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు లక్ష్మణ్, హిందూస్థాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు కుతాడి కృష్ణ, ఆఫీస్ కోఆర్డినేటర్ కే. సురేశ్, జాయింట్ సెక్రటరీలు నాగార్జున, ఎస్.వెంకటేశ్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి

బాలానగర్: జేఎన్‌టీయూలోని అడ్మిషన్ బ్లాక్ ఆవరణలోని రోడ్డును, జే హబ్ పరిసరాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని కోరుతూ స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. వెంకటేశ్వరరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు రాహుల్ నాయక్, దుర్గ ప్రసాద్, భానుప్రకాశ్, సంతోష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భూగర్భ డ్రైనేజీలో చెత్త తొలగింపు



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్, సాయిబాబా ఆలయం లైన్‌లో డ్రైనేజీ సమస్యను స్థానికులు అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె గురువారం సదరు ప్రాంతాన్ని సందర్శించి జలమండలి సిబ్బందితో భూగర్భ డ్రైనేజీలోని చెత్తాచెదారాన్ని తొలగింపజేయించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బొల్లి శ్రీనివాసరావు, నవ్వులూరి రోశయ్య, రవీందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును ఇస్తున్న జగదీశ్వర్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌కు చెందిన బాలింగం ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందాడు. బిల్లు చెల్లించేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడడంతో నియోజకవర్గ నాయకుడు ఏకాంత్‌గౌడ్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లి దరఖాస్తు చేయించారు. దీంతో ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 60 వేలు మంజూరు కాగా జగదీశ్వర్ గౌడ్ గురువారం లబ్ధిదారుడికి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు విద్యాకల్పన ఏకాంత్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి, నియోజకవర్గ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జితేందర్, వెంకటేశ్, మునీశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి ఫ్లై ఓవర్‌కు పీజేఆర్ పేరు పెట్టడంపై హర్షం

కూకట్‌పల్లి: కొండాపూర్ నుంచి గచ్చిబౌలి ఫ్లై ఓవర్‌కు దివంగత పీజేఆర్ పెట్టడంపై తెలంగాణ ప్రదేశ్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఎ. దుర్గారాణి గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. స్వపక్షమైనా, విపక్షమైనా ప్రజల పక్షాన పోరాటం చేసిన గొప్ప నాయకుడు పీజేఆర్ అని కొనియాడారు.

ఆలయంలో పూజలు

ఆల్విన్‌కాలనీ: సాయినగర్‌లో వేంచేసియున్న షిర్డీ సాయిబాబా ఆలయంలో శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్ రావు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురభి రమేశ్ రావు, సుబ్బారెడ్డి, పవన్‌కుమార్, మాధవరెడ్డి, సాయిగౌడ్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజాంపేట్: విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ గేమ్ ఛేంజర్ అవార్డ్స్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ఫౌండర్ సీఈఓ సత్యవోలు రాంబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్ అండ్ కల్చర్, కవులు, గాయకులు, కళాకారులు, జ్యోతిష్యం బిజినెస్, వైద్యులు, ఎడ్యుకేషన్, అగ్రికల్చర్, సామాజిక సేవ, ఎంటర్‌టైన్‌మెంట్, డిఫరెంట్ ప్రొఫెషనల్స్, మీడియా, హెల్త్, సైన్స్ అండ్ టెక్నాలజీ, డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ, జస్టిస్, లా అండ్ ఆర్డర్, ఫైనాన్స్ అండ్ బ్యాంకింగ్, అచ్చీవర్స్, స్పిరిచువల్, హాస్పిటాల్టి లాంటి తదితర విభాగాల్లో జూలై 5లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అప్లికేషన్ కోసం 9959971679, 8121208279 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మర్యాదపూర్వక కలయిక

ఆల్విన్‌కాలనీ: మున్నూరు కాపు సంఘం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పోతుల రాజేందర్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. జిల్లాలో మున్నూరు కాపు సంఘ అభివృద్ధి, సంఘం ఐక్యతకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చింతపంటి భూమయ్య, తెల్ల హరికృష్ణ, నాయుడు, శ్రీనివాస్, సత్యనారాయణ, రవి, అల్లం మహేశ్, నిర్మల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో పోతుల రాజేందర్ తదితరులు

ఖాళీ స్థలాల పన్ను వసూళ్లకు రంగం సిద్ధం..!

కూకట్‌పల్లి: జీహెచ్ఎంసీ అధికారులు ఖాళీ స్థలాలకు కూడా పన్ను వేసేందుకు రంగం సిద్ధం చేశారు. 2020 నుంచి రిజిస్ట్రేషన్ ఆధారంగా స్థలాలను గుర్తించి ఆ స్థల విలువలో 0.5 శాతం ట్యాక్స్ విధించనున్నారు. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిల్‌లో ఇప్పటికే 1800 ఖాళీ స్థలాలను గుర్తించారని తెలిసింది. ఇదేవిధంగా మరో 2 వేల స్థలాల వరకు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఖాళీ స్థలాల పన్ను ద్వారా కూకట్‌పల్లి జంట సర్కిళ్లలోనే జీహెచ్ఎంసీకి సుమారు రూ. 8 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. వారం రోజులుగా జీహెచ్ఎంసీ రెవెన్యూ సిబ్బంది పూర్తిస్థాయిలో అదే పనిలో నిమగ్నమైనట్లు తేలింది. ఇదిలా ఉండగా ఖాళీ స్థలాలకు పన్ను చెల్లించేందుకు ప్రజలెవరూ ముందుకు రావడం లేదని సిబ్బంది పేర్కొంటున్నారు.

ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ సభ్యుల సమావేశం



మాట్లాడుతున్న చైర్మన్ రాజు



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

మూసాపేట: ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ సభ్యుల సమావేశం దేవీ గ్రాండ్ హోటల్‌లో గురువారం నిర్వహించారు. భరత్‌నగర్, ఎస్ఆర్‌నగర్ బ్రాంచ్ సభ్యులు పాల్గొన్న సమావేశంలో బ్యాంక్ చైర్మన్ టిఆర్‌విపిఎస్ రాజు గతేడాది నుంచి సభ్యుల పెరుగుదల, గోల్డ్ లోన్, బ్యాంక్ లావాదేవీలను వివరించారు. ఆరోగ్య బీమాతో పాటు మరిన్ని సదుపాయాలు అందించేలా కృషి చేస్తున్నామన్నారు. 1997లో ప్రారంభమైన ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్‌కు 42 బ్రాంచ్‌లు, లక్షకు పైగా సభ్యులు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఏ. సోమలింగంగౌడ్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం. నరేందర్ కుమార్, డిజిఎం మురళీ కృష్ణ, ఆర్ఎం మెహర్‌కృష్ణ, బ్రాంచ్ మేనేజర్ వెన్నెల, ఎస్ఆర్‌నగర్ బ్రాంచ్ మేనేజర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను తొలగించరూ..!



బాలానగర్ ప్రధానరోడ్డులో నాలా పక్కనే ఉన్న రాళ్లు



చరబండ రాజునగర్‌లో స్కూల్‌వద్ద ..

కూకట్‌పల్లి: బాలానగర్ ప్రధాన రహదారి ఎడమ వైపు వర్షపు నీరు వెళ్లేలా మరమ్మతులో భాగంగా డ్రైనేజీలో మట్టిని తీశారు. అయితే వారం రోజులు గడుస్తున్నా దానిని తొలగించకపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అదేవిధంగా చరబండ రాజునగర్‌లో స్కూల్ నిర్మించే క్రమంలో డ్రైనేజీపై బిల్లలను తొలగించి మట్టిని స్కూల్ పక్కన వేయడంతో అటు విద్యార్థులు ఇటు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్న కుమార్ స్పందించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. వీలైనంత త్వరగా మట్టి, చెత్తాచెదారం తొలగించాలని వారిని కోరారు.

మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరణ

నిందితుడి అరెస్ట్, కేసు నమోదు

చందానగర్: మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించిన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన ప్రకారం వివరాలు...శేరిలింగంపల్లి ఓల్డ్ ఎంఐజీ– 730లో నివాసముండే పెదపాటి శాంతిలక్ష్మి గురువారం ఉదయం 6 గంటలకు ఇంటి ముందు ఊడుస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి హోండా యాక్టివా బైక్‌పై వచ్చి వచ్చి 4 తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. ఈ మేరకు బాధితురాలు చందానగర్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గంటల వ్యవధిలోనే నిందితుడు అరెస్ట్..

మహిళ మెడలో నుంచి గొలుసు తస్కరించిన ఘటనలో గంటల వ్యవధిలోనే చందానగర్ పోలీసులు కేసును ఛేదించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు గోపినగర్‌లో నివాసముండే అర్జున్ కుమారుడు కె.సూర్య (19)గా గుర్తించి యువకుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నిందితుడు మదీనాగూడలోని శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ..


మోతీనగర్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అల్లాపూర్ సీఐ సామల వెంకటరెడ్డి సూచించారు. అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివేకానందనగర్ చౌరస్తాలో డ్రగ్స్ వాడొద్దు అని వాల్ పోస్టర్లను గురువారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అలాగాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన మంచి విషయాలను నేర్చుకుంటూ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లు శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు రోణంకి జగన్నాథం, ప్రధాన కార్యదర్శి చెవ్వూరి మధుసూదనాచారి, కోశాధికారి గుత్తికొండ రామకృష్ణ, సభ్యులు ఎన్. రోశయ్య, బండారి ప్రసన్నాంజనేయులు, కమ్మరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ కాలనీలో..


మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో భాగ్యనగర్ కాలనీలో కళాశాల విద్యార్థులతో కలిసి హెచ్ఎంటీ శాతవాహననగర్, కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్, భాగ్యనగర్ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ నరసింహ ముఖ్య అతిథిగా హాజరై మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక బృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అలాగే మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు చిత్ర లేఖనం, చర్చా, కవిత, నాటక ప్రదర్శన వంటి పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో మాదక ద్రవ్య వ్యతిరేక బృందం కన్వీనర్ ఎస్. శ్రావణి, అధ్యాపకులు డాక్టర్ లక్ష్మయ్య, విశ్వేశ్వర శర్మ, ఉత్తర ఫాల్గుణి, గోపాల్, పద్మ, మంజుల పాల్గొన్నారు.



డ్రగ్స్ వాడొద్దంటూ అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటరెడ్డి



కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ర్యాలీలో సబ్ ఇన్‌స్పెక్టర్ నరసింహ, విద్యార్థులు